ఉచిత బస్సుల్లో ఆలయాలకు వెళ్తున్నరు

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్
- ప్రజాపాలన సభలకు హాజరు

ఎల్లారెడ్డిపేట/గంభీరావుపేట/ముస్తాబాద్, జనవరి 4: ఉచిత బస్సు ప్రయాణం వల్ల మహాలక్ష్ములు గుళ్లు, గోపురాలు, చర్చిలకు వెళ్తున్నారని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. గురువారం ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆరున్నర కోట్ల జీరో టికెట్లు ఇవ్వగలిగామని దీంతో యాదాద్రి, భద్రాచలం, చర్చిలకు వెళ్తున్నారని చెప్పారు. బంధుత్వాలు పెరుగుతున్నాయని, చిరు వ్యాపారులకు మేలు కలుగుతున్నదని పేర్కొన్నారు. వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలను అమలు చేసి తీరుతామని స్పష్టం చేశారు. ఇక్కడ సర్పంచ్ నేవూరి వెంకట్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి, ఎంపీడీవో చిరంజీవి తదితరులు ఉన్నారు. అలాగే, గంభీరావుపేట మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయం వద్ద నిర్వహిస్తున్న ప్రజా పాలన సభను ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సందర్శించారు. అభయ హస్తం పథకాలకు దరఖాస్తు చేసుకోవడానికి విచ్చేసిన గ్రామస్తులతో ఆది శ్రీనివాస్ మాట్లాడారు. అనంతరం విప్ ఆది శ్రీనివాస్‌ను మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ శ్రీధర్ వారికి పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు కొండూరి గాంధీ, మండలాధ్యక్షుడు హమీద్, జిల్లా ఉపాధ్యక్షుడు తిరుపతి, ఎంపీటీసీ పరశురాములు, నాయకులు పాల్గొన్నారు. ముస్తాబాద్ మండల కేంద్రంలోని రైతు వేదిక వద్ద ప్రజా పాలన సభకు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ హాజరయ్యారు. అనంతరం పోత్గల్‌లోని శివ కేశవ ఆలయంలో పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సుమతి, మండల అధ్యక్షుడు బాల్‌రెడ్డి, ఎంపీడీవో రమాదేవి, నాయకులు పాల్గొన్నారు.

గంభీరావుపేట: ప్రజాపాలనలో గ్రామస్తులతో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

పిల్లలు కావడం లేదని..

- కుటుంబ కలహాలతో వలస కూలీ ఆత్మహత్య

రుద్రంగి, జనవరి 4: పిల్లలు కావడం లేదని మనస్తాపంతో వలస కూలీ గురువారం ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన పాండ్రు (38) కూలీ పని కోసం రుద్రంగి వచ్చి జీవనం సాగిస్తున్నాడు. పాండ్రు మొదటి భార్యకు పిల్లలు కాకపోవడంతో నాలుగు సంవత్సరాల క్రితం రెండో వివాహం చేసుకున్నాడు. రెండో భార్యకు కూడా పిల్లలు కాకపోవడంతో తరచూ గొడవలు జరుగుతుండేవి. ఈ క్రమంలో మనస్తాపానికి గురైన పాండ్రు గురువారం ఉదయం బాత్రూంలో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. రెండో భార్య భీమ్లా ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజేశ్ తెలిపారు.

చలాన్ల చెల్లింపు రాయితీని సద్వినియోగం చేసుకోవాలి

రుద్రంగి, జనవరి 4: రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన పెండింగ్ ట్రాఫిక్ చలాన్లు చెల్లింపు రాయితీని సద్వినియోగం చేసుకోవాలని ఎస్ఐ రాజేశ్ సూచించారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ట్రాఫిక్ చలాన్లు కట్టడానికి స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ద్విచక్ర వాహనాలు, ఆటోలకు 80శాతం, హెవీ వాహనాలకు 60 శాతం రాయితీ ప్రకటించినట్లు చెప్పారు. ఈ అవకాశాన్ని వాహనాదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. స్పెషల్ డ్రైవ్ తర్వాత పెండింగ్ ట్రాఫిక్ చలాన్లు ఉంటే వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు.

ఆరో రోజు 26,365

- ప్రజాపాలనలో దరఖాస్తుల వెల్లువ

రాజన్న సిరిసిల్ల, జనవరి 4 (నమస్తే తెలంగాణ) :సిరిసిల్లరూరల్/ రుద్రంగి/ ఎల్లారెడ్డిపేట/ఇల్లంతకుంట/బోయినపల్లి : ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజాపాలనలో దరఖాస్తులు వెల్లువలా వస్తున్నాయి. గత నెల 28 నుంచి ప్రారంభమైన ప్రజాపాలన ఆరో రోజుకు చేరింది. గురువారం ఒక్కరోజే 26,365 దరఖాస్తులు రాగా, ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా 13 మండలాలు, 255 గ్రామ పంచాయతీలు, రెండు మున్సిపాల్టీల నుంచి 1,56,150 మంది శిబిరాలకు వచ్చి 1,38,350 దరఖాస్తులు సమర్పించారు. ఉదయం 8 నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు అధికారులు దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. దరఖాస్తు దారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఫారాలను అధికారులు, సిబ్బంది స్వయంగా తీసుకుంటున్నారు. అన్ని మండలాలు, గ్రామాల్లో స్థానిక సర్పంచులు, జడ్పీటీసీలు, ఎంపీపీలు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.


ఇల్లంతకుంట : వెంకట్రావు పల్లిలో ప్రజా పాలనలో దరఖాస్తును స్వీకరిస్తున్న ఎంపీపీ ఊట్కూరి వెంకటరమణారెడ్డి

సిరిసిల్ల రూరల్ : పద్మనగర్‌లో దరఖాస్తులను స్వీకరిస్తున్న జడ్పీటీసీ మంజుల

బోయినపల్లి : విలాసాగర్‌లో ప్రజల నుంచి దరఖాస్తులను తీసుకుంటున్న ఎంపీపీ వేణుగోపాల్, ప్రజాప్రతినిధులు

వేములవాడ : పట్టణంలోని 23వ వార్డు ప్రజా పాలన దరఖాస్తులను పరిశీలిస్తున్న కలెక్టర్ అనురాగ్ జయంతి

దరఖాస్తుదారులకు సహకరించాలి

- కలెక్టర్ అనురాగ్ జయంతి
- వేములవాడ పట్టణంలో ప్రజాపాలన దరఖాస్తు కేంద్రాల పరిశీలన

వేములవాడ/వేములవాడ రూరల్, జనవరి 4: ప్రజాపాలనకు దరఖాస్తు చేసుకునేందుకు వచ్చే ప్రజలకు పూర్తిస్థాయిలో సహకరించాలని కలెక్టర్ అనురాగ్ జయంతి అధికారులకు సూచించారు. గురువారం వేములవాడ పట్టణంలోని 21, 22, 23, 24 వార్డుల్లో, వేములవాడ రూరల్ మండలం మల్లారం, మర్రిపల్లి ప్రజాపాలన సభలను కలెక్టర్ పరిశీలించారు. దరఖాస్తుదారుల సందేహాలను నివృత్తి చేసి ప్రతి దరఖాస్తును రిజిస్టర్‌లో నమోదు చేయాలని తెలిపారు. అర్హులైన లబ్ధిదారులు ఆరు గ్యారెంటీ పథకాలకు దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. కార్యక్రమాల్లో కమిషనర్ అన్వేశ్, మేనేజర్ సంపత్ రెడ్డి, మర్రిపల్లిలో ఎంపీపీ బండ మల్లేశం, తహసీల్దార్ సుజాత, ఎంపీడీవో రాంరెడ్డి, సర్పంచ్ మల్లేశం, నాయకులు పాల్గొన్నారు.

ప్రాథమిక కేంద్రాల్లో ప్రసవాలను పెంచాలి

- ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల సిబ్బందికి ఆదేశం
- కలెక్టర్ అనురాగ్ జయంతి
- వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం

కలెక్టరేట్, జనవరి 4: జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రసవాలను పెంచాలని వైద్యాధికారులు, సిబ్బందిని కలెక్టర్ అనురాగ్ జయంతి ఆదేశించారు. గురువారం కలెక్టర్ ప్రభుత్వ దవాఖానల్లో సంస్థాగత, సాధారణ ప్రసవాలు, ఆరోగ్య కేంద్రాల నిర్మాణ పురోగతి, టీబీ పరీక్షల పురోగతి, దోమల నివారణకు చేపట్టాల్సిన చర్యలు, తదితర అంశాలపై జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, ఇంజినీరింగ్, పంచాయతీ, మున్సిపల్ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, 24 గంటల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఖచ్చితంగా ప్రసవాల సంఖ్యను పెంచాలని తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పనితీరుపై కలెక్టర్ ఆరా తీశారు. రిస్క్ ఉన్న కేసులను జిల్లా దవాఖాన, ఏరియా దవాఖానలకు పంపాలని సూచించారు. జిల్లాలో ప్రగతిలో ఉన్న 4 పీహెచ్‌సీ, 57 ఆరోగ్య ఉపకేంద్రాల నిర్మాణ పురోగతిపై ఆరా తీసిన కలెక్టర్, నిర్మాణ పనుల్లో వేగం పెంచి, త్వరగా నిర్మాణాలు పూర్తి చేయాలన్నారు. కాగా 33 ఆరోగ్య ఉపకేంద్రాలు ఇప్పటికే పూర్తయ్యాయని అధికారులు కలెక్టర్‌కు వివరించారు. దోమల నివారణకు గ్రామాలు, మున్సిపాలిటీలలో ఫాగింగ్ చేయాలని మున్సిపల్, పంచాయతీ అధికారులను ఆదేశించారు. కొవిడ్ నేపథ్యంలో వైద్యులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. కిరణం కార్యక్రమం కింద ఫిజికల్ హెల్త్‌తో సమానంగా మెంటల్ హెల్త్‌కు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. టీబీ బాధితులను గుర్తించడం, చికిత్స అందించడంపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. ఇక్కడ అదనపు కలెక్టర్ పీ గౌతమి, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ సుమన్, డీపీవో రవీందర్, రమేశ్, సూర్యప్రకాశ్, డాక్టర్లు మురళీధర్‌రావు, సంతోష్, ఫసత్‌అలీబేగ్, అన్వేశ్, శ్రీరాములు, రజిత, మహేశ్‌రావు, అధికారులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అనురాగ్ జయంతి

8న జాతీయ అప్రెంటీస్ మేళా

సిరిసిల్ల రూరల్, జనవరి 4: తంగళ్లపల్లి మండలం మండెపల్లి శివారులోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ఈనెల 8న ప్రధాన మంత్రి జాతీయ అప్రెంటీస్ షిప్ మేళా నిర్వహిస్తున్నామని కళాశాల ప్రిన్సిపాల్ కనకయ్య తెలిపారు. ఈ మేళాలో హైదరాబాద్ వరుణ్ మోటర్స్, సర్వో మేధతోపాటు ప్రముఖ పారిశ్రామిక సంస్థలు, కంపెనీలు పాల్గొననున్నాయి. ఐటీఐ పూర్తి చేసిన వారందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు 9505674905, 8106794500లో సంప్రదించాలని కోరారు.

అయోధ్య అక్షింతలు పంపిణీ

ఇల్లంతకుంట, జనవరి, 4 : వల్లంపట్లలో అయోధ్య పూజిత అక్షింతలను సర్పంచ్ కేతిరెడ్డి అనసూయ దంపతులు గురువారం ఇంటింటికీ అందజేశారు. ఇక్కడ వార్డు సభ్యులతోపాటు గ్రామస్తులు ఉన్నారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

వేములవాడ రూరల్, జనవరి 4: వేములవాడ మున్సిపల్ పరిధిలోని నాంపెల్లి పెద్ద చెరువులో గుర్తుతెలియని మృతదేహం లభ్యమైనట్లు వేములవాడ టౌన్ సీఐ కరుణాకర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ, చెరువులో మృతదేహాన్ని బయటకు తీయగా మృతుడు 50 సంవత్సరాల్లోపు ఉంటాడని, రాజేశ్‌గా గుర్తించామని, ఇతని శరీరంపై రెబల్ అని పచ్చబొట్టు ఉందన్నారు. వేములవాడ టౌన్ సీఐ 8712656413, ఎస్ఐ రమేశ్ 8008316966ను సంప్రదించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

'రైతుమిత్ర' ఎన్నిక

కోనరావుపేట, జనవరి 4: నాగారంలో రైతు మిత్ర సంక్షేమ సంఘం నూతన కార్యవర్గాన్ని గురువారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా దూంపేట నాగరాజు, ఉపాధ్యక్షుడిగా మల్లయ్య, కార్యదర్శిగా గంగయ్య, ప్రధాన కార్యదర్శిగా ప్రకాశ్, డైరెక్టర్లుగా మధుసూదన్‌రావు, బాస జనార్ధన్, భాస్కర్‌రావు, భూమయ్య, సైండ్ల శ్రీనివాస్, వంగపల్లి భూమయ్య, కొమ్ము చంద్రయ్య, ప్రభాకర్, దేవరాజు, అంజయ్య, శంకరయ్య, నారాయణ, రామచంద్రం, బాలయ్య, రాజ మల్లయ్య, చిన్న రాజయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

ఉపాధి నిర్వహణ పనులు భేష్

- కేంద్ర బృందం సభ్యుల కితాబు

కోనరావుపేట, జనవరి 4: మండలంలోని పలు గ్రామాల్లో ఉపాధి నిర్వహణ పనులు బాగున్నాయని కేంద్ర బృందం సభ్యులు కితాబిచ్చారు. వెంకట్రావుపేట, మల్కపేట, మరిమడ్లలో జలశక్తి అభియాన్ కేంద్ర బృందం సభ్యులు గణేష్‌కుమార్ బరన్వల్, లక్ష్మీనారాయణ దామోదర్ పర్యటించారు. అమృత సరోవర్‌లో భాగంగా మహాత్మా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో నిర్వహించిన పనులను పరిశీలించారు. వెంకట్రావుపేటలో ఉపాధి హామీలో పూడికతీసిన కేశవరావు చెరువును క్షేత్రస్థాయిలో సందర్శించారు. చెరువులో నీరు నిల్వ ఉండి ప్రజలకు ఉపయోగపడుతుండడంతో, పని తీరు బాగుందని ప్రశంసించారు. పనులు పూర్తి చేసిన సర్పంచ్ మంతెన సంతోష్, ఉపాధి హామీ అధికారులు, సిబ్బందిని కేంద్రం బృందం సభ్యులు అభినందించారు. అలాగే మల్కపేటలో కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా కేసీఆర్ ప్రభుత్వం నిర్మించిన ప్యాకేజ్-9 (చెన్నమనేని రాజేశ్వర్‌రావు) రిజర్వాయర్‌ను సందర్శించారు. ప్రాజెక్టును నిర్మించిన తీరు అద్భుతమని కొనియాడారు. అనంతరం మరిమడ్లలో కొండం చెరువును పరిశీలించారు. వీరి వెంట డీఆర్డీవో నక్క శ్రీనివాస్, అడిషనల్ డీఆర్డీవో మదన్, ఎంపీడీవో ఓదెల రామకృష్ణ, అడిషనల్ పీడీ ఐకేపీ జక్కుల రవికుమార్, ఏపీవో మంచికట్ల శ్రీనివాస్, టీఏలు పాల్గొన్నారు.

కోనరావుపేట: వెంకట్రావుపేటలోని కేశవరావు చెరువు పనులు పరిశీలిస్తున్న కేంద్ర బృందం సభ్యులు

హాస్టల్ మెస్ బిల్లులను విడుదల చేయాలి

- ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లారపు ప్రశాంత్
- కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేత

కలెక్టరేట్, జనవరి 4 : తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న హాస్టల్స్ విద్యార్థుల మెస్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని కలెక్టర్ అనురాగ్ జయంతిని కోరారు. గురువారం కలెక్టరేట్‌లో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఏవో రాజిరెడ్డికి వినతిపత్రం అందించారు. అనంతరం ప్రశాంత్ మాట్లాడుతూ, సోషల్ వెల్ఫేర్, బీసీ వెల్ఫేర్, మైనార్టీ వెల్ఫేర్, ట్రైబల్ వెల్ఫేర్ హాస్టల్స్‌లో ఐదు నెలల నుంచి రూ.5,485 కోట్ల మెస్ బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. విద్యార్థులు చాలీచాలని సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించి వెల్ఫేర్ హాస్టల్స్‌కు సంబంధించి పెండింగ్ బకాయిలను విడుదల చేయాలన్నారు. మెస్ కాస్మొటిక్ చార్జీలు పెంచాలని, లేకపోతే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఇక్కడ నాయకులు పెండేల ఆదిత్య, చిర్ర వేణు, సంతోష్, నిఖిత ఉన్నారు.

కలెక్టరేట్ ఏవో రాజిరెడ్డికి వినతి పత్రం ఇస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

జాతీయ స్థాయి క్రీడలకు ఎంపిక

కొడిమ్యాల, జనవరి 4: మండల కేంద్రానికి చెందిన ఎర్రోజు తక్షిల్ ఎస్జీఎఫ్ 67వ జాతీయ స్థాయి క్రీడా పోటీలకు ఎంపిక య్యాడు. బీహార్‌లో జరిగిన అండర్-17 బాలుర క్రికెట్ పోటీల్లో తెలంగాణ రాష్ట్రం తరపున పాల్గొననున్నాడు. కాగా డిసెంబర్ లో గద్వాల్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో కరీంనగర్ జిల్లా తరపున ఆడి ప్రతిభ కనబర్చాడు. రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ చూపి జాతీయ స్థాయికి ఎంపికైనట్లు జిల్లా ఎస్జీఎఫ్ కార్యదర్శి లక్ష్మీరాం నాయక్ తెలిపారు.

కేటీఆర్‌ను కలిసిన జిల్లా నాయకులు

మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి ఆధ్వర్యంలో క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కేటీఆర్

సిరిసిల్ల టౌన్, జనవరి 4: హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్‌ను గురువారం సిరిసిల్లకు చెందిన బీఆర్ఎస్ నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సిరిసిల్ల పట్టణశాఖ బీఆర్ఎస్ అధ్యక్షుడు జిందం చక్రపాణి, మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ ఆధ్వర్యంలో నూతన సంవత్సర క్యాలెండర్‌ను కేటీఆర్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. అనంతరం ఈ క్యాలెండర్‌ను నాఫ్‌స్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు ఆవిష్కరించారు. ఇక్కడ బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, మున్సిపల్ వైస్ చైర్మన్ మంచె శ్రీనివాస్, మున్సిపల్ పాలకవర్గ సభ్యులు, నాయకులు ఉన్నారు.

బీఆర్ఎస్ సమావేశానికి వేములవాడ నాయకులు

చల్మెడ లక్ష్మీనరసింహారావుతో నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులు

కరీంనగర్ పార్లమెంట్ స్థాయి పార్టీ ముఖ్య ప్రజాప్రతినిధులు, నాయకులతో హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో గురువారం జరిగిన సమావేశానికి వేములవాడ నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, నాయకులు తరలివెళ్లారు.
-వేములవాడ, జనవరి 4

మొన్న తల్లి.. నేడు తండ్రి

- అనారోగ్యంతో భార్యాభర్తలు మృతి
- అనాథలైన కూతుళ్లు
- కోనరావుపేట మండలం ధర్మారంలో విషాదం

రోదిస్తున్న కూతుళ్లు

కోనరావుపేట, జనవరి 4: అనారోగ్యంతో బాధపడుతూ మొన్న తల్లి, నేడు తండ్రి మృతి చెందగా ఇద్దరు కూతుళ్లు అనాథలయ్యారు. గ్రామస్తులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కోనరావుపేట మండలంలోని ధర్మారం గ్రామానికి చెందిన నేరేళ్ల దేవయ్య (65), కనుకవ్వ (54) దంపతులకు ఇద్దరు కూతుళ్లు గంగ, జమున ఉన్నారు. ఇందులో పెద్ద కూతురుకు వివాహం కాగా, చిన్న కూతురు కూలీ పనిచేస్తుంటుంది. ఈక్రమంలో దేవయ్య పక్షవాతంతో బాధపడుతూ ఇంట్లో ఉండగా కనుకవ్వ కుటుంబ భారాన్ని మోసింది. కాగా, కనుకవ్వ అనారోగ్యం బారిన పడి, తీవ్ర అస్వస్థతకు గురై డిసెంబర్ 18న మృతి చెందింది. దీంతో గ్రామస్తులు, కులస్థులు చందాలు వేసుకొని అంత్యక్రియలు నిర్వహించారు. భార్య మృతితో మానసికంగా కుంగిపోయిన దేవయ్య అనారోగ్యంతో తీవ్ర అస్వస్థతకు గురై గురువారం ఉదయాన్నే మృతి చెందాడు. 15 రోజుల వ్యవధిలో తల్లిదండ్రులను కోల్పోవడంతో ఇద్దరు కూతుళ్ల రోదనలు మిన్నంటాయి. అనంతరం బంధువుల సహకారంతో అంత్యక్రియలు నిర్వహించారు. పేద కుటుంబాన్ని ఆదుకోవాలని సర్పంచ్ అరుణ, గ్రామస్తులు కోరుతున్నారు.

దివ్యాంగులు ఆత్మస్థైర్యంతో సాగాలి

- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్
- ఘనంగా ప్రపంచ బ్రెయిలీ దినోత్సవం

కలెక్టరేట్, జనవరి 4 : సమాజంలో దివ్యాంగులు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగుతూ, అన్ని రంగాల్లో రాణించాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో ప్రపంచ బ్రెయిలీ దినోత్సవాన్ని నిర్వహించారు. సఖీ కేంద్రం ఆవరణలో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ హాజరై లబ్ధిదారులను ఉద్దేశించి ప్రసంగించారు. ప్రభుత్వం ఆసరా పెన్షన్లతో పాటు వారు నైపుణ్యాలు పెంపొందించుకోవడానికి తగిన సహాయం అందించడానికి సిద్ధంగా ఉందని తెలిపారు. మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో దివ్యాంగులకు ఆర్థిక పునరావాస పథకంలో గ్రౌండ్ చేసిన యూనిట్ల లబ్ధిదారులకు విప్ ఆది శ్రీనివాస్ చెక్కులను అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమాధికారి లక్ష్మీ రాజం, సీడీపీవోలు ఎల్లయ్య, సుచరిత, అలేఖ్య, ఆనందిని, సిబ్బంది రోజా, విజయ, డీసీపీవో స్వర్ణలత, బాలకృష్ణ, తిరుపతి, రాజేందర్, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ ఆయుధం కేసులో ఒకరికి జైలు

గాంధీచౌక్, జనవరి 4 : అక్రమ ఆయుధాలు కలిగియున్న కేసులో ఒకరికి ఏడాది కఠిన కారాగార జైలు శిక్షతోపాటు రూ.2 వేలు జరిమానా విధిస్తూ సిరిసిల్ల అసిస్టెంట్ సెషన్స్ న్యాయమూర్తి శ్రీలేఖ గురువారం తీర్పు చెప్పారు. అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ లక్ష్మీప్రసాద్ వేముల తెలిపిన వివరాల మేరకు.. తంగళ్లపల్లి మండలం చిన్న లింగాపూర్‌కు చెందిన జక్కుల బాబు సీపీఐ ఎం ఎల్ జనశక్తి పార్టీ మిలిటెంట్. 2017 ఏప్రిల్ 20న పోలీసు తనఖీల్లో జిల్లెల్ల చెక్‌పోస్ట్ వద్ద పట్టుపడ్డాడు. బాబు వద్ద పిస్టల్, తూటాలు లభించాయి. ఈ మేరకు తంగళ్లపల్లి పోలీసులు అక్రమ ఆయుధాల చట్టం కింద కేసు నమోదు చేసి బాబును రిమాండ్‌కు తరలించారు. అప్పటి కేసు విచారణ అధికారి లక్ష్మారెడ్డి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. కోర్టు మానిటరింగ్ హెడ్ కానిస్టేబుల్ సీహెచ్ శంకర్, కోర్టు కానిస్టేబుల్ నవీన్ 10 మంది సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టారు. కేసు పూర్వపరాలు పరిశీలించిన న్యాయమూర్తి నేరం రుజువు కావడంతో నిందితుడికి జైలు శిక్ష విధించారు.

విద్యార్థినులకు వైద్య పరీక్షలు

రుద్రంగి ప్రభుత్వ కళాశాలలో విద్యార్థులను పరీక్షిస్తున్న వైద్యాధికారులు

రుద్రంగి, జనవరి 4: రాష్ట్రీయ బాల్ స్వస్థ్య కార్యక్రమంలో భాగంగా గురువారం రుద్రంగి మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థినులకు వైద్యాధికారి ప్రభాకర్ వైద్య పరీక్షలు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ గంగయ్య, వైద్యాధికారులు ఆరోగ్యంపై జాగ్రత్తలను వివరించారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED
WANTED
jobs Apply Now!
★త్రివేణి హాంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం, జీతం: 18K. Ph: 9640400073/9160900024.
NT-319403-All
CHANGE OF NAME
★I, ALALA JALANDHAR, R/o. H.No. 1-8, Ammakkapet, Ibrahimpatnam, Jagityal, TS. Changed My Name as ELALA JALANDHAR, S/o. Elala Chinna Gangaram.
NT-319317
గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.
Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 91827 77571
91827 77194